సమస్యల వలయంలో సీహెచ్‌సీ

● హంగులున్నా అందని సేవలు ● మెనూ పాటించని దుస్థితి ● సరిపడా వైద్యులు లేక అందని వైద్యం

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 1: కాగజ్‌నగర్ పట్టణం, మండల జనాభాకు సరిపడేందుకు గత ప్రభుత్వం రూ.5కోట్ల అంచనాతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సామాజిక ఆసుపత్రి-సీహెచ్‌సీ) ప్రారంభించారు. ఆసుపత్రికి అన్ని హంగులున్నప్పటికీ రోగులకు సరైన వైద్యం అందడం లేదు. ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పూర్తి స్థాయి వైద్యులు లేరు. ఉన్న సిబ్బంది కాంట్రాక్టు పద్ధతిన కొనసాగుతున్నారు. సిర్పూరు నియోజకవర్గం ప్రాంత ప్రజలకు రోగం వస్తే ఇదే పెద్ద దిక్కు. బెజ్జూరు, పెంచికల్‌పేట, దహెగాం, సిర్పూరు(టి), కౌటాల, చింతలమానేపల్లి, కాగజ్‌నగర్ మండలాల ప్రజలకు అత్యవసరమైతే నేరుగా ఈ ఆసుపత్రే వస్తారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యులు లేకపోవటంతో రోగులకు సరైన వైద్యం అందటం లేదు. ఇదే విషయాన్ని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కూడా అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అయినా ఇంతవరకు ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యులను నియమించలేదు. నిత్యం ఆసుపత్రికి 200నుంచి 300మంది రోగులు వస్తుంటారు. ఇంత మందిని పరీక్షించడానికి ఉన్నది ఇద్దరే డాక్టర్లు. వస్తున్న రోగులకు వైద్యం అందించడం వీరికి తలకు మించిన భారంగా మారింది. 24 గంటల పాటు వైద్యసేవలు అందించాల్సి ఉండగా ఉన్న ఇద్దరు డాక్టర్లు తమ డ్యూటీ సమయం వరకు విధులు నిర్వహించి పోతున్నారు. రాత్రి వేళల్లో వైద్యసేవలు అంతంత మాత్రమే.



CHC - KAGAZNAGAR
సాధారణ భోజన పట్టిక
అల్పాహారం
1. ఇడ్లీ 150 గ్రా॥ చట్నీ సాంబారు (100 గ్రా॥) 3 ఇడ్లీలు
2. పొంగలి/కిచిడి/ఉప్మా చట్నీ 300 గ్రాలు
మధ్యాహ్న భోజనము
1. అన్నము -450 గ్రాలు లేదా 6 చపాతీలు
2. కూర- 150 గ్రాలు
3. ఆకు కూర - 150 గ్రాలు
4. సాంబారు - 200 మి.లీ
7. అరటి పండు - 1
రాత్రి భోజనము
1. అన్నము - 350 గ్రాలు లేదా 6 చపాతీలు
2. కూర - 150 గ్రాలు
3. సాంబారు - 200 మి.లీ
4. ఉడకబెట్టిన గుడ్డు -1

రోగులకు అందించాల్సిన ఆహార పట్టిక

అధికారుల నిఘా కరువు..

సిర్పూరు నియోజకవర్గానికి సేవలు అందిస్తున్న ఆసుపత్రిపై ఉన్నతాధికారుల నిఘా పూర్తిగా కరువైంది. ఎంత మంది రోగులు అడ్మిట్ అవుతున్నారు..? మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని విచారించే అధికారే లేరు. 24 గం టలు సేవలు అందించాల్సి ఉండగా ఉన్న సిబ్బంది సరిపోవడం లేదు. ఈ ఆసుప త్రికి వచ్చిన నిధులు, చేసిన పనులపై సమ గ్రంగా విచారణ జరిపితే అన్ని విషయాలు బయటికి వచ్చే అవకాశాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు.



కాగజ్‌నగర్‌లోని సామాజిక ఆసుపత్రి భవనం

సిబ్బందికి జీతాలు లేక తంటాలు..

సామాజిక ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ పారిశుధ్య సిబ్బందికి ఐదునెలలగా జీతాలు రావటం లేదు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు వినతి పత్రాలిచ్చినా ఇంతవరకు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఒకవైపు కుటుంబ పోషణ, మరో వైపు జీతాల సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. రెండ్రోజుల్లో వేతనాలు రాకుంటే పోరుబాట పట్టనున్నట్లు ఔట్ సోర్సింగ్ సిబ్బంది పేర్కొన్నారు.

సేవలు అందిస్తున్నాం..:

డాక్టర్ చెన్నకేశవరావు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అధికారి

ఆసుపత్రిలో ఉన్న సిబ్బందితోనే వైద్యసేవలు అందిస్తున్నాం. వైద్యుల కొరత ఉన్నప్పటికీ కూడా ఉన్న వారితోనే రోగులను పరిశీలిస్తున్నాం. కుక్క, పాము కాటుకు మందులను అందుబాటులో ఉంచాం. మెను ప్రకారం రోగులకు భోజనం పెడుతున్నాం.

అమలు కాని మెనూ..

ఆసుపత్రిలో అడ్మిట్ అయిన పేషంట్లకు మెనూ ప్రకారం భోజనం పెట్టాల్సి ఉంటుంది. ఉదయం ఇడ్లి/సాంబారు/కిచిడి/ఉక్మ/ఉడకబెట్టిన కోడిగుడ్డు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కేవలం ఉక్మా పెట్టి నడిపిస్తున్నారు. అలాగే మధ్యాహ్నం అన్నం, సాంబారు మాత్రమే ఇస్తున్నారు. 300నుంచి 400గ్రాముల రైస్ పెట్టాల్సి ఉండగా, కేవలం 150గ్రాముల మాత్రమే పెడుతున్నారు. కోడిగుడ్డు, మజ్జిగ, అరటి పండు లాంటివి రోగులకు ఇవ్వటం లేదు. అలాగే రాత్రి భోజనంలో కూడా అన్నం, సాంబారు మాత్రమే ఇస్తున్నారు. ప్రసూతి మహిళలకు ఇవ్వాల్సిన భోజనం కూడా సరిగా ఉండటం లేదని పేర్కొంటున్నారు. ప్రతినెల లక్షలాది బిల్లులు చేస్తున్నప్పటికీ మెనూ పాటించడం లేదన్నది రోగుల ఆరోపణ.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

కంట్రోల్ రూంను పరిశీలించిన కలెక్టర్



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 1: భారీవర్షాల నేపథ్యంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూంను కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. కంట్రోల్‌రూంద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్న విధానాన్నిపరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి. వాటిని ఎవరికి తెలియజేశారు తదితర వివరాలను కంట్రోల్‌రూం ఆపరేటర్‌ను అడిగితెలుసుకున్నారు. 24గంటలపాటు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మరోరెండు రోజులపాటు భారీనుంచి అతిభారీవర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీచేసిందనందున పూర్తి జాగరూకతతో ఉండాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు నెలకొంటే ప్రజలు ఏ సమయంలోనైనా కంట్రో రూంకు 6304686505 సమాచారం అందించాలన్నారు. వారివెంట అదనపుకలెక్టర్ దాసరివేణు, డీఎస్పీ సదయ్య తది తరులున్నారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

బెజ్జూరు, సెప్టెంబరు 1: మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిరె వసంత్ (48) శనివారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. వసంత్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లోఉన్న పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించిన కటుంబసభ్యులు అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా మృతిచెందాడు. మృతుడి భార్య నిర్మల ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పులి అడుగులు గుర్తింపు



పంట చేనులో పులి అడుగులు

కెరమెరి, సెప్టెంబరు 1: మండలం కేలి(కె) గ్రామ శివారులోని పంటపొలాల్లో అటవీ శాఖాధికారులు ఆదివారం పులి అడుగులను గుర్తించారు. ఈ సంద ర్భంగా ఎస్ఎఫ్‌వో స్రవంతి, ఎఫ్‌బీవో వందన ఆధ్వర్యంలో ఆయా గ్రామస్థులకు పులి కనిపిస్తే తీసుకోవాల్సి చర్యలపై అవగాహన కల్పించారు. సాయంత్రం పంట చేనుకువెళ్లవద్దని, కనీసం అయిదారుగురు కలిసి వెళ్లాలన్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

● ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ఆసిఫాబాద్, సెప్టెంబరు 1: భారీ వర్షాల దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి, సీఎం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి శాంతికుమారి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్‌లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలతో వరద ప్రభావితప్రాంతాల్లో పరిస్థితులు చేపట్టాల్సిన రక్షణచర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలవారీగా నెలకొన్న వరదపరిస్థితులు, చేడపతున్న సహాయక చర్యల వివరాలను తెలుసుకున్నారు. మరో రెండురోజులపాటు భారీ నుంచి అతిభారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎక్కడాకూడా ప్రాణనష్టం సంభవించకుండా, అవాంచనీయఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని, అధికారులు క్షేత్ర స్థాయిలో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. భారీవర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేంత వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలుజలదిగ్బంధంలో చిక్కుకుంటే తక్షణ సహాయ చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైనతే రాష్ట్రం నుంచి సహాయకబృందాలు పంపిస్తామన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు వచ్చేవరకు వేచి చూడకుండా పోలీసులు, అగ్నిమాపకసిబ్బంది సేవలను వినియోగిస్తూ ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవా లని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. వాగులు, కల్వర్టులు, నదుల వద్దకు ఎవరూ వెళ్లకుండా భద్రతాచర్యలు చేపట్టామని తెలపారు. వరదప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధికారుల సమన్వయంతో ప్రజారక్షణ దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు. జిల్లాలోని అడ, కుమరంభీం ప్రాజెక్టుల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో ఎస్పీ డీవీ శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్ వేణు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు పొలాల అమావాస్య.. దుక్కిటెద్దుల పండుగ

● ఎడ్లను అలంకరిస్తున్న రైతులు ● గ్రామాల్లో ప్రత్యేక పూజలు ● జిల్లాలో పండుగ వాతావరణం



చింతలమానేపల్లి, కెరమెరిలో పశువులను అలంకరించే వస్తువులు కొనుగోలు చేస్తున్న రైతులు

చింతలమానేపల్లి, సెప్టెంబరు 1: ఆరుగాలం కష్టం చేసి పంటలను పండించే రైతన్నకు సాగుపనిలో తోడు ఉండే బసవన్నల(ఎద్దుల)తో విడదీయరాని బంధం. చేనులో దుక్కిదున్ని విత్తనం విత్తిన నుంచి పంటను నూర్పిడి చేసి ధాన్యాన్ని ఇంటికి తెచ్చేంత వరకు ప్రతిపనిలో రైతన్నకు ఎద్దులతో ఏదో రకంగా సహాయపడుతుంటాయి. భూమిని నమ్ముకుని వ్యవ సాయం చేసే రైతులు సాగులో సహాయపడే బసవ న్నలను ఎంతో ప్రేమగా చూసుకోవడంతో పాటు దైవంగా భావిస్తారు. ఎద్దులు నందీశ్వరుని అవతారంగా భావిస్తారు. శ్రావణమాసం ముగింపులో బహుళ అమావాస్య రోజున వచ్చే పొలాల పండుగకు ఎంతో విశిష్టత ఉంది. ప్రకృతిని పూజించడంతో పాటు వ్యవసాయంలో ఆరుగాలం శ్రమించే ఎద్దులను అందంగా సింగారించి ఆరాధించే అరుదైన పండుగ ఇది. వ్యవసాయ పనులు పూర్తైన క్రమంలో వచ్చే తొలిపండుగ కావడంతో రైతులు, కొన్ని సామాజిక వర్గాల ప్రజలు పొలాల అమావాస్యను అత్యంత ఘనంగా జరుపుకోవడం అనవాయితీ. ఇతర పండుగలతో పోల్చితే ముచ్చటగా మూడు రోజులు జరుపుకునే పొలాల పండుగలో సామాజిక అంశాలు, సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడుతాయి.

బసవన్నలకు అలంకరణ..

శ్రావణమాసంలో వచ్చే చివరిపండుగగా పొలాల అమావాస్యను గ్రామీణులు భావిస్తారు. పల్లెల్లో అత్యంత ఘనంగా జరుపుకుంటారు. సోమవారం ఉదయం రైతులు అటవీప్రాంతానికి వెళ్లి విరబూసిన జంజోరు పూలు, పత్రి ఆకులు, నారను తీసుకు వచ్చి తోరణాలు తయారుచేసి ఇంటి గుమ్మాలకు కడతారు. మట్టితో ఎద్దుల ప్రతిమలను తయారు చేసి పూజించి ఉపవాస దీక్షను విరమిస్తారు. ఎద్దులనుచెరువులు, వాగుల్లో శుభ్రంగా కడిగి ఇళ్లకు తీసుకువస్తారు. వాటి వీపుపై రంగురంగుల బొమ్మలు, జూలు, మెడలో గంటలతోపాటు ఎడ్లనుఅందంగా అలంకరిస్తారు. సాయంత్రం ఆంజనేయస్వామి, పోచమ్మ ఆలయానికి తీసుకెళ్తారు. ఆలయం చుట్టు ఎద్దులతో ప్రదక్షణలు చేయిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు.

ఎడ్లకు నైవేద్యం..

ఆలయాల్లో ప్రదక్షిణ అనంతరం ఇంటికి తీసుకువచ్చిన ఎడ్లకు రైతులు పూజలు చేసి ఆ రోజుచేసిన వంటకాలను నైవేద్యంగా తినిపిస్తారు. అనంతరం కుటుంబ సభ్యులంతా కలిసి విందు ఆరగిస్తారు. ఇది పురాతన కాలం నుంచి వస్తున్న ఆచారంగా పెద్దలు చెబుతారు. ఎద్దులు లేని రైతులు తమ బంధువుల ఎడ్ల జతలను తీసుకు వచ్చి పూజలు చేస్తారు.

మంగళవారం బడుగా పండుగ..

పొలాల అమావాస్య మరుసటి రోజు బడుగా పండుగ జరుపుకోవడం అనవాయితీ. శ్రావణమాసంలో నెలరోజులపాటు మాంసాహారాన్ని భుజించకుండా నియమనిష్టలుపాటించి మంగళవారం బడుగ పండగ జరుపుకుంటారు. బడుగ రోజు ఉదయం మాత్రం మహిళలు భాగస్వామ్యం ఉంటుంది. ఉదయం పూట ప్రత్యేక పూజలు చేస్తారు. పొలాల అమావాస్య రోజు ప్రత్యేకంగా మట్టితో తయారు చేసిన ఆ ప్రతిమలను ఆడబిడ్డలు గ్రామశివారు ప్రాంతంలోని చెరువుకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారు. ఇలా సంస్కృతి సంప్రదాయాల కలబోతతో ప్రకృతిని, పశువులను పూజించి ఆరాధించడం పొలాల అమావాస్య పర్వదిన వేడుకలో మాత్రమే కనిపిస్తుంది.

వారసంతలో పొలాల అమావాస్య సందడి

కెరమెరి: మండలకేంద్రంలోని ఆదివారం నిర్వహించిన వారసంతలో పొలాల అమావాస్య పండుగ సందడి నెలకొంది. రైతులు ఈ రోజున తమ పశువులను ప్రత్యేకంగా అలంకరిస్తారు. సంతలో వ్యాపారులు పశువుల అలంకరణ వస్తువులు విక్రయిస్తున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో రైతులు వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. అలాగే పండుగను పురస్కరించుకుని నిత్యావసర సరుకులు కొనుగోళ్లకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

జిల్లా ఆసుపత్రి నిర్వహణకు నిధుల కొరత

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1: జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రి కేవలం పేరుకే పెద్దాసుపత్రిగా కొనసాగుతోంది. ఆసుపత్రిలో సూపరింటెండెంట్ ఉండాల్సి ఉన్నప్పటికీ తాత్కాలిక ప్రాతిపదికన కొనసాగుతున్నారు. సదరు అధికారికి పూర్తి స్థాయిలో అధికారాలు లేకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఆసుపత్రిలో రోగులు చీకట్లో ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. ఆసుప త్రిలో జనరేటర్ ఉన్నప్పటికీ నిర్వహణ కోసం అవసరమైన నిధులు లేకపోవడంతో తాత్కాలిక సూపరిటెండెంట్ సొంత డబ్బులతో డీజిల్ తీసుకు రావాల్సి వస్తోందని తెలిసింది. శనివారం రాత్రి జిల్లాకేంద్రంలో భారీ వర్షం కురవడంతో ఆసుపత్రి ఎదుట వర్షం నీరు నిలిచింది. ఆసుపత్రి లోపల విద్యుత్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకుని సీపీఎం నాయకులు ఆసుపత్రికి చేరుకొని రోగులు, వారి బంధువులతో కలిసి ధర్నా నిర్వహిం చారు. దీంతో స్పందించిన అధికారులు వెంటనే డీజిల్ పోసి విద్యుత్ వచ్చేలా చేశారు. ఇప్పటికైనా సమస్యను పరిష్క రించాలని రోగులు కోరుతున్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1: పెన్షన్ ఉద్యోగులకు భిక్ష కాదని అది తమ హక్కు అని ఉద్యోగ, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సెప్టెంబరు1 పెన్షన్‌విద్రోహ దినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉద్యోగ,ఉపాధ్యాయులు జేఏసీ జిల్లా కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం అదనపుకలెక్టర్ వేణుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఇందురావ్, హేమంత్‌సిండే,ఊశన్న, శ్రీనివాసరావు, ఖమర్,శ్రీనివాస్,లక్ష్మణ్,తుకారాం, సదాశివ్, శ్రీనివాస్, ఎన్‌శ్రీనివాస్, అమరేందర్, సంతోష్, సునీల్, ప్రభాకర్, చంద్రయ్య, ఉపేందర్, వసీంఅహ్మద్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ జేఏసీ నాయకులు



'ఉద్యోగుల మస్టర్ తొలగించడం సరికాదు'

మందమర్రిటౌన్, సెప్టెంబరు 1: మందమర్రి ఏరియా స్టోర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు లంచ్‌కు వెళ్లి కొంత ఆలస్యంగా వచ్చినందుకు మస్టర్ తొలగించడం సరికాదని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సహాయకార్యదర్శి భీమనాథుని సుదర్శన్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ జూలై 27న ఆడిట్ వారు ఆడిట్ చేసి ఉద్యోగుల మస్టర్లను తొలగించారని, దీంతో ఉద్యోగులు మానసిక ఆందోళనకు గురయ్యారని తెలిపారు. పది నిమిషాలు ఆలస్యంగా రావడం వల్ల కంపెనీకి జరిగే నష్టం ఏమిలేదని, గంటసేపు కార్మికులు ఎక్కువగా ఉంటే అదనపు వేతనం చెల్లిస్తున్నారా అని ప్రశ్నించారు. అధికారులు కక్ష సాదింపు చర్యలు మానుకోవాలని కోరారు. అలాగే కాసిపేట2 గనిలో పనిచేస్తున్న గిరిజన కార్మికుడైన రామును కొందరు మద్యం సేవించి కొట్టారని తెలిపారు. ఇలాంటి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

'బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 1: బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని సింగరేణి కార్మికసంఘాల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. ఆదివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. సింగరేణి వేలంలో పాల్గొనాలనే ఆలోచనలో యాజమాన్యం ఉన్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. దీనివల్ల సంస్థకు టెండర్ రావచ్చు, రాకపోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి కేటాయింపు ద్వారా సింగరేణికి బొగ్గు బ్లాకులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వ చొరవ చూపాలని కోరారు. సమావేశంలో హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, సింగరేణి ఉద్యోగుల సంఘం బాధ్యులు ఎండీ రియాజ్‌అహ్మద్, టి శ్రీనివాస్, మేకల రాములు, మేకల పోషమల్లు, కుమారస్వామి, మణిరామ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సెమీ స్కిల్డ్ వేతనం ఇవ్వాలి: సీఐటీయూ

శ్రీరాంపూర్, సెప్టెంబరు 1: బ్లాస్టింగ్ కార్మికులను బ్లాస్టింగ్ క్రూగా గుర్తించి సెమీస్కిల్డ్ వేతనం ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికసంఘం(సీఐటీయూ) రాష్ట్రఅధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీ ఓబీకంపెనీ జీవీఆర్‌లో పనిచేస్తున్న బ్లాస్టింగ్ కాంట్రాక్టుకార్మికులు యూనియన్‌లో చేరగా, వారినిసాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ, 2021లో అసిస్టెంట్ లేబర్‌కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో ఇందారం ఓబీ బ్లాస్టింగ్ కాంట్రాక్టుకార్మికులను సెమీస్కిల్డ్ వర్కర్లుగా గుర్తించేందుకు ఒప్పందం జరిగిందన్నారు. కానీ అధికారులు ఆ ఒప్పందాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. బ్లాస్టింగ్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనం ఇవ్వకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం నూతన పిట్‌కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అగ్గు కిరణ్, కార్యదర్శిగా ఆకుల నరేష్, ఉపాధ్యక్షుడిగా పెద్దింటి సుధాకర్, సహాయకార్యదర్శిగా బండారి సత్తయ్య, కోశాధికారిగా సుద్దుల శంకర్, కమిటీ సభ్యులుగా సురేష్, శంకర్, సుభాష్, శ్రీనివాస్, రమేష్‌ను ఎన్నుకున్నారు.

రాజకీయాలకు తలొగ్గిన యాజమాన్యం: ఏఐటీయూసీ

శ్రీరాంపూర్, సెప్టెంబరు 1: రాజకీయాలకు తలొగ్గిన యాజమాన్యం సర్ఫేస్ జనరల్‌మజ్దూర్ పదోన్నతులు ఆపుతోందని ఏఐటీయూసీ ఉపప్రధానకార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కేబాజీసైదా ఆరోపించారు. యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వాలవల్ల సింగరేణిలో రాజకీయ ప్రమేయం పెరిగిసంస్థకు నష్టం జరిగిందన్నారు. ప్రస్తుతప్రభుత్వం సైతం అదేబాటలో పయణిస్తోందని ఆరోపించారు. శ్రీరాంపూర్ డివిజన్‌లో 108మంది సర్ఫేస్‌మజ్దూర్ల ఖాళీలనుభర్తీ చేయడానికి సర్క్యులర్ ఇచ్చి, ఉద్యోగుల మార్కుల ఆధారంగా పదోన్నతి జాబితాను సిద్ధం చేసి నెలలు గడుస్తుండగా, యాజమాన్యం రాజకీయ జోక్యానికి తలొగ్గి లెటర్లు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా సర్ఫేస్ జనరల్‌మజ్దూర్ పదోన్నతులు కల్పించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రాంచ్‌సహాయ కార్యదర్శి కొమురయ్య, బుచ్చయ్య, పిట్ కార్యదర్శులు లక్ష్మణ్, నర్సింగరావు, సదానందం,రవీందర్, నవీన్‌రెడ్డి, మల్లికార్జున్, కుమారస్వామి, నాగేశ్వర్‌రావు, తిరుపతి, మైనింగ్‌స్టాఫ్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్య పరిరక్షణ

శ్రీరాంపూర్, సెప్టెంబరు 1: ఆటలతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ అన్నారు. ఉద్యోగుల వార్షిక క్రీడల్లో భాగంగా ప్రగతి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో ఇండోర్ క్రీడలను(చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్) ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాటాడుతూ, ఉదోగులు తమ విధులు నిర్వర్తిస్తూనే క్రీడాపోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఆర్‌కే-5 గనిమేనేజర్ అబ్దుల్ ఖాదిర్, క్రీడల గౌరవ కార్యదర్శి కె. సృజన్‌పాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ సిహెచ్. అశోక్, తదితరులు పాల్గొన్నారు.

'సీపీఆర్ఎంఎస్‌లో లోపాలు సవరించాలి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు1: సీపీఆర్ఎంఎస్‌లో లోపాలు సవరించాలని టీబీజీకేఎస్ మాజీప్రధానకార్యదర్శి ఆదివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. ఈనెల3న సీపీఆర్ఎంఎస్‌పై సమావేశం నిర్వహించనున్న సందర్భంగా ఆయనపలుసూచనలు చేశారు. సీపీఆర్ఎంఎస్‌లో అధికారులకు 25లక్షల వరకు వైద్యసేవలు అందిస్తున్నారని, కార్మికులకు 8లక్షలరూపాయలు మాత్రమే పరిమితి విధించిందన్నారు. అధికారులు మందులు కొనుగోలు చేయడానికి, రోగనిర్ధారణ పరీక్షలు చేయించుకోవడానికి 36వేల రూపాయలు వారి బ్యాంకుఖాతాలో జమ చేస్తున్నారని, కానీ కార్మికులకు ఎలాంటి డబ్బులు ఇవ్వడం లేదన్నారు. సింగరేణిఆస్పత్రుల్లో రిటైర్డ్ కార్మికులకు సరైనవైద్యం అందడం లేదన్నారు. కార్మికులు అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తూ అనేక అనారోగ్యాలకు గురవుతారని, వారు రిటైర్ అయిన తరువాత అనేక వ్యాధులబారిన పడతారని తెలిపారు. అలాంటి సందర్భంలో తక్కువ పెన్షన్, తక్కువ సీపీఆర్ఎంఎస్ నిధులు తక్కువగా ఉండడంతో వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిలాస్‌పూర్‌లో జరిగే సమావేశాల్లో ఆయా సమస్యలను చర్చించి రిటైర్డ్ కార్మికులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైద్యుడి కోసం రోడ్డెక్కిన మండలవాసులు



వైద్యుడి కోసం నిరసన వ్యక్తం చేస్తున్న మండలవాసులు

లింగాపూర్, సెప్టెంబరు 1: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిని నియమించాలని ఆదివారం మండలప్రజలు రోడెక్కి నిరసన తెలిపారు. ఆసుపత్రిలో డాక్టర్, స్టాఫ్ నర్సు లేకపోవడంతో మండలంలోని 71గ్రామాలకు సరైన వైద్యం అందడం లేదన్నారు. ఎన్నోసార్లు సిబ్బందిని నియమించాలని డీఎంహెచ్‌వోని కోరినా స్పందన లేదన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఫార్మసిస్టు కూడా వారానికి ఒక్కరోజు మాత్రమే విధులకు హాజరవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆసుపత్రిలో సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు. కార్యక్రమంలో మండలనాయకులు ఆడే అశ్విన్, రమేష్, హసిరాం, గంగుపటేల్, బావురావ్, పరశురాం, గ్రామస్థులు, పాల్గొన్నారు.

ఒర్రెలో గల్లంతైన వ్యక్తి మృతి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1: ఒర్రెలో గల్లంతై ఒకరు మృతిచెందిన సంఘటన ఆసిఫాబాద్ మండలం బొందగూడ గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు తెలి పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన టేకం గణేష్(35) శనివారం ఉదయం పశువులు మేపడానికి వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో అప్పటికే కురిసిన భారీ వర్షంతో గ్రామసమీపంలోని ఒర్రె ప్రవాహం పెరిగింది. రాత్రి8గంటల ప్రాంతంలో ఒర్రె దాటుతున్న క్రమంలో గణేష్ కొట్టుకుపోయాడు. స్థానికులు గమనించి రాత్రి గాలించినా దొరకలేదు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి భీము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొన్నం

కరీంనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): భారీవర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలుఅప్రమత్తంగాఉండాలని రాష్ట్రరవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ఆదివారం ఉదయం కరీంనగర్ కార్యాలయం నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తూ అప్రమత్తం చేశారు. కంట్రోల్‌రూమ్ ద్వారా వచ్చిన ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. పురాతన, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అక్కడి నుంచి ప్రజలు ఇతర ప్రాంతాలకు పంపించాలన్నారు. మరో రెండురోజుల పాటు భారీ వర్షాలుంటాయన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరీంనగర్ జిల్లాకలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రాజెక్టుల నీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కిరాణ షాపులో చోరీకి పాల్పడ్డ వ్యక్తుల అరెస్టు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 1 : జిల్లా కేంద్రంలోని వేముల బస్తీలో గల ఓ కిరాణ షాపులో చోరీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో నిందితుల వివరాలు వెల్లడించారు. పట్టణంలోని తిలక్‌న గర్‌కు చెందిన మోర్ల అరుణ్, గుగులోత్ నెహ్రూ, గొర్రె పవన్ కుమార్‌లు శనివారం రాత్రి వేములబస్తీలోని వొడ్నాల నరేష్‌కు చెందిన కిరాణ షాపు తాళం పగలగొట్టి షాపులోకి చొరబడి రూ.5వేల నగదుతోపాటు, రూ.10వేల విలువ గల సిగరేట్ ప్యాకెట్ డబ్బాలను దొంగిలించుకుపోయారని సీఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, రైల్వేస్టేషన్ ప్రాంతంలో సిగరేట్ డబ్బాలు అమ్మేందుకు వచ్చినట్లు సమాచారంతో వారిని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారన్నారు. వారి వద్ద నుంచి రూ.2,500 నగదు, రూ.10వేల విలువగల సిగరేట్‌డబ్బాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ముగ్గురు నిందితులను రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఆయన వెంట ఎస్సై సురేష్, సిబ్బంది ఉన్నారు.

భారీ వర్షాలతో తిరుపతి రైలు రద్దు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 1: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లే రైలును అధికారులు రద్దు చేశారు. శనివారం రాత్రి తిరుపతి నుంచి కరీంనగర్ బయలుదేరిన రైలు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు విజయవాడ సమీపంలో నిలిపి వేశారు. ఆదివారంరాత్రి కరీంనగర్ రైల్వేస్టేషన్‌నుంచి బయలు దేరాల్సిన రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. రైలు రద్దుపై సరైన సమాచారం లేదని, రైల్వే అధికారులు నిర్లక్ష్యమైన సమాధానం ఇస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● కేసీఆర్‌పై మంత్రుల ఆరోపణలు దురదృష్టకరం

● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 1: హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఆదివారం నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. అమలుకు నోచుకోని హామీలనిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఏ గ్రామంలోనైనా రుణమాఫీ పూర్తిస్థాయిలో జరిగిందా చెప్పాలని ఆయన కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. దమ్ముంటే ధరణిని రద్దు చేయాలని సవాల్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి


శరణ్య (ఫైల్)

జైపూర్, సెప్టెంబరు 1: మండలంలోని కుందారం గ్రామానికి చెందిన దాసరి శరణ్య ((19) అనే వివాహిత ఆదివారం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన దాసరి సతీష్, శరణ్యలు మార్చిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్ని రోజులుగా సాఫీగా సాగిన సంసారంలో గొడవలు మొదలయ్యాయి. భర్త సతీష్, అతని కుటుంబీకులు కట్నం తేవాలని హింసించడంతో వేధింపులు భరించలేక శరణ్య పుట్టింటికి వచ్చింది. జీవితంపై విరక్తి చెందిన శరణ్య ఆగస్టు 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు తండ్రి సుదమల్ల నరేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

చెన్నూరు, సెప్టెంబరు 1: చెన్నూరు పట్టణంలోని బేతాళవాడకు చెందిన కడవంటి మంజుల (35) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. 17 సంవత్సరాల క్రితం భీమారం మండలం ఖాజీపల్లి గ్రామానికి చెందిన మంజుల, చెన్నూరు పట్టణానికి చెందిన కడవండి మహేష్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. మహేష్ తాపీ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. వీరికి ముగ్గురు కుమారులు. మంజుల రెండేండ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. చికిత్సలు చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. భర్త మహేష్ వేధింపులతోనే కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్వేత తెలిపారు.

కోడి పందేలు ఆడుతున్న వారి అరెస్టు

వేమనపల్లి, సెప్టెంబరు 1: వేమనపల్లి గ్రామంలోని బెస్తవాడలో కోడి పందేలు ఆడుతున్న వారిని ఆదివారం అరెస్టు చేశామని నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. సమాచారం మేరకు దాడి చేయగా గుమ్ముల పోశం, చింతల శంకర్‌లు పట్టుబడగా పల్లికొండ దీపక్, కంపెల శంకర్, గుమ్ముల రాజేష్, జెల్ల శేఖర్, ఎల్లెల శీను, మంచెర్ల హన్మంతు, బోరె రాజం, భక్తు బాపు, తొర్రెం తిరుపతి, గుమ్ముల గంగయ్య, ఎల్లెల శేఖర్‌లు పారిపోయారని తెలిపారు. వారి వద్ద నుంచి 3 కోడి పుంజులు, 3 కత్తులు, రూ. 600 నగదు స్వాధీనం చేసుకుని 17 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

విద్యుదాఘాతంతో పశువుల మృతి

కన్నెపల్లి, సెప్టెంబరు 1: మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్ వైర్లు తెగిపడి రెండు పశువులు మృతిచెందాయి. ఎద్దులను ఇంటి ఆవరణలో కట్టేసి ఉంచగా గాలి, వర్షానికి విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు తెలిపారు. మృతిచెందిన కోడెల విలువ లక్ష రూపాయలు ఉంటుందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. సంఘటన స్థలాన్ని జేఎల్ఎం అనిల్ పరిశీలించాడు.

పాత పెన్షన్ సాధించే వరకు పోరాడుతాం



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 1: పాత పెన్షన్ విధానాన్ని సాధించే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. సీపీఎస్ విద్రోహ దినంగా పాటిస్తూ ఆదివారం ఉద్యోగులంతా జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిరసన తెలిపారు. శ్రీహరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఓపీఎస్ అమలులోకి తీసుకువచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. గంగాధర్, వెంకటేశ్వర్లు, శంకర్‌గౌడ్, శ్రీనివాస్ దేశ్‌పాండే, లావుడ్య కృష్ణ, శాంకరి పాల్గొన్నారు.

కుటుంబాన్ని బలిగొన్న ఆన్‌లైన్ ట్రేడింగ్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం... సాఫీగా సాగుతున్న ఆ కుటుంబాన్ని ఆన్‌లైన్ ట్రేడింగ్ బలి తీసుకొంది. పెట్టుబడి కోసం లోన్ యాప్‌లో అప్పు చేసి మరీ పెట్టుబడి పెట్టాడు. మొదట లాభం వచ్చినా అనంతరం నష్టం రావ డంతో సుమారు రూ.20 లక్షల వరకు కోల్పోయాడు. దీంతో మనస్తాపానికి గురై తను ఆత్మహత్యకు పాల్పడినా భార్య, పిల్లలను వేధిస్తారని భావించి ఇద్దరు పిల్లలు, భార్యకు విషమిచ్చి అతడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన హైదరాబాద్‌లో జరగగా ఆ కుటుంబం మంచిర్యాల కు చెందిన వారు కావడంతో విషాదం నెలకొంది.

- ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.20 లక్షల నష్టం - లోన్ యాప్‌లో అప్పు తీసుకొని పెట్టుబడి - ఇద్దరు పిల్లలు, భార్యకు విషమిచ్చి భర్త ఆత్మహత్య - హైదరాబాద్‌లో ఘటన, మంచిర్యాలలో విషాదం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 1: మంచిర్యాల పట్టణం రెడ్డికాలనీకి చెందిన వెంక టేష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తు న్నాడు. గాజులరామారంలో ఏరియాలో ఓ అపార్ట్ మెంట్‌లో భార్య వర్షిణి (33), కుమారులు రిషికాం త్ (11), విహాంత్ (3)లతో కలిసి ఉంటున్నాడు. శనివారం రాత్రి వెంకటేష్ భార్యపిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేష్‌కు వర్షిణితో 19 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మృతుడి భార్య వర్షిణి గృహిణి. రిషికాంత్ 6వ తరగతి చదువుతున్నాడు. వెంకటేష్ కొంతకాలంగా ఆన్‌లైన్ ట్రేడింగ్, బెట్టింగ్‌లలో పెట్టుబడులు పెట్టాడు. పెట్టుబడి కోసం కొన్ని ఆన్‌లైన్ యాప్‌లలో లోన్లు కూడా తీసుకున్నాడు. ట్రేడింగ్, బెట్టింగ్‌లో మొత్తంగా రూ.20లక్షల మేర నష్టపోయాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ వెంకటేష్ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తాను ఒక్కడే ఆత్మహత్య చేసుకుంటే భార్య పిల్లలు రోడ్డున పడుతారని భావించి ముందుగా వారికి విషం ఇచ్చాడు. అనంతరం వెంకటేష్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమ మృతికి ఆర్థిక ఇబ్బందులే కారణమని సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. వెంకటేష్ మంచిర్యాలలో ఉంటున్న తండ్రి ఇప్ప కొమురయ్యకు ఫోన్‌లో తెలిపాడు. విషయం తెలిసిన వెంటనే కొమురయ్య పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు చేరుకునేలోపే విగత జీవులుగా మారారు. వారి అంత్యక్రియలు సోమవారం మంచిర్యాలలో జరగనున్నాయి. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాముల సంచారంతో భయం.. భయం..

మందమర్రిటౌన్, సెప్టెంబరు 1: పట్టణంలోని గాంధీనగర్ పాములకు నిలయంగా మారింది. కాలనీ పక్కనే పాలవాగు, చెట్లు, తుమ్మలు ఉన్నాయి. వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తే పాములు ఇండ్లలోకి వస్తున్నాయని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. రెండు నెలల్లో నాలుగు విష సర్పాలను కాలనీ వాసులు చంపేశారు. నెల రోజుల క్రితం ఇంట్లో నిద్రిస్తున్న చిన్నారిని కట్ల పాము కాటు వేసింది. చిన్నారి కేకలు వేయడంతో పామును చంపేసి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆదివారం 11 అడుగుల కొండ చిలువ ఇంట్లో చొరబడి చొరబడింది.

స్టోర్‌రూంను యజమాని తెరువగా అగుపిం చడంతో స్నేక్ క్యాచర్స్‌కు సమాచారం అందించడంతో కొండ చిలువను పట్టుకుని అడవిలో వదిలి పెట్టారు. కాలనీల్లోని చెట్ల పొదలు, తుమ్మలను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. కాలనీల్లో వీధి దీపాలు కూడా లేవు. విష సర్పాలు, కొండ చిలువలు ఇండ్లలోకి వస్తున్నాయని పేర్కొంటున్నారు. మున్సిపల్, సింగరేణి యాజమాన్యం కాలనీలోని చెత్తాచెదారం తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

సిర్పూర్(టి), సెప్టెంబరు 1: మండలం మీదుగా పికప్‌వాహనంలో అక్ర మంగా తరలిస్తున్న ఆరు గేదెలను పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. శనివారం రాత్రి అక్రమంగా పశువులను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు మండల కేంద్రంలోని డౌనల్ ఏరియాలో వాహనాన్ని తనిఖీ చేయగా ఆరుగేదెలు పట్టుబడినట్లు తెలిపారు. ఈమేరకు జగిత్యాలకు చెందిన అనిల్, శేఖర్‌పై కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు గేదెలను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

టీడీపీకీ పూర్వ వైభవం ఖాయం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 1: తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం ఖాయమని, దేశంలోనే తిరుగులేని నాయకుడు చంద్రబాబునాయుడు అని పెద్దపల్లి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ తెలిపారు. మొదటిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మూడు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. చంద్రబాబు నాయకుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్డీయే కూటమిలో టీడీపీ కీలకంగా మారిందన్నారు. ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. వాసాల సంపత్, ఎండీ షరీఫా, సాగర్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

బెల్లంపల్లి: పట్టణంలోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో టీడీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మణిరాంసింగ్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు భవిష్యత్ రూపకర్త అని, భావితరాలకు బంగారు బాటలు వేయగల ఏకైక నాయకుడని పేర్కొన్నారు. గద్దల నారాయణ, బొల్లు మల్లయ్య, రమేష్, హసన్, గంగాదర్‌గౌడ్, రాములు, సత్యనారాయణ, సరోజ, అరుణ, యాసిన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

మందమర్రిటౌన్, సెప్టెంబరు 1: మందమర్రి మున్సిపాలిటీలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం 1, 2వ వార్డులు, యాపల్ ఏరియా, జీఎం ఆఫీస్ కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. సరిగ్గా లేని విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లను బాగు చేయాలని ఏఈ మల్లయ్యకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీరు, డ్రైనేజీలు, రోడ్లు సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని తెలిపారు. జ్వరాలు ప్రబలుతున్నందున ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. జీఎం ఆఫీస్ కాలనీ ఏరియాలో కమ్యూనిటీ హాలు కావాలని వార్డు ప్రజలు కోరారని, హాలు నిర్మాణం చేపడతామన్నారు. మాజీ విప్ నల్లాల ఓదెలు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు సొత్కు సుదర్శన్, నోముల ఉపేందర్‌గౌడ్, గుడ్ల రమేష్, వనం నర్సయ్య, ఆకారం రమేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే, మురికి నీరు చూపిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మిషన్ భగీరథ పేరుతో కోట్లు దండుకున్నారు

మిషన్ భగీరథ పేరుతో గత ప్రభుత్వం కోట్ల రూపాయలు దండుకుంటుందని, మందమర్రిలో రూ.40 కోట్లతో పథకం ప్రవేశపెట్టారని, కానీ ప్రజలకు సురక్షిత నీరు అందించలేదని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం వార్డుల్లో సరఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. మురుగు నీటిని చూపుతూ ఈ నీరు తాగితే ప్రజలు రోగాల బారిన పడతారన్నారు. త్వరలోనే రూ. 30కోట్లతో సురక్షిత తాగునీటి పథకం అందుబాటులోకి తెస్తానని తెలిపారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు.

పట్టణంలోని 1వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నేత, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్‌ను ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పరామర్శించారు. సదానందం వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

మాజీ జడ్పీటీసీ కుటుంబానికి పరామర్శ

భీమిని, సెప్టెంబరు 1: భీమిని మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పోతురాజుల గంగక్క మనుమడు యువాన్ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ గంగక్క కుటుంబాన్ని పరామర్శించారు. బాలుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ సంగర్స్ రవీందర్ రావు, ప్రమోద్‌గౌడ్, పులగం సతీష్ ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

మందమర్రిరూరల్, సెప్టెంబరు 1: పొన్నారం ప్రభుత్వ పాఠశాలలో పదేండ్లుగా పనిచేసిన ఉపాధ్యాయుడు పద్మారావు ఆదివారం పదవీ విరమణ పొందాడు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్య పద్మారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన 317 జీవో బాధితులు

బెల్లంపల్లి, సెప్టెంబరు 1: 317 జీవో బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను బాధిత ఉద్యోగులు ఆదివారం కలిసి వినతి పత్రం అం దించారు. బెల్లంపల్లికి చెందిన పలువురు బాధి తులు 317 జీవోవల్ల నష్టపోయామని ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీని సన్మానించారు.

వ్యాధుల కాలం.. పారిశుధ్యం శూన్యం

● ఎల్లూరు గ్రామంలో ప్రభలుతున్న విషజ్వరాలు


ఎల్లూరులో నెలకొన్న అపరిశుభ్రత

పెంచికలపేట, సెప్టెంబరు 1: మండలంలోని ఎల్లూరు గ్రామంలో విషజ్వరాలు ప్రభలుతున్నాయి. గ్రామంలో పారిశుధ్యం లోపించి టైఫాయిడ్, మలేరియా తోపాటు ఇప్పటివరకు నాలుగైదు డెంగ్యూ కేసులు సైతం నమోదయ్యాయి. డెంగ్యూ బారినపడిన వారు మంచిర్యాల, కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. దోమల మందుస్ప్రే, బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ వంటివి గ్రామంలో కంటికి కనిపించడం లేదు. పలుమార్లు పంచాయతీకార్యదర్శి దృష్టికిసమస్యను తీసుకెళ్లినా పట్టించుకోడంలేదని గ్రామ స్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య పనులు నిర్వహించాలని అలాగే వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సేవాలాల్ సేనా సింహగర్జన కరపత్రాల విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న సేవాలాల్ సేనా నాయకులు

కెరమెరి, సెప్టెంబరు 1: ఈనెల10న సేవాలాల్ సేనా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందిరాపార్కువద్ద నిర్వహించే గిరిజన సింహగర్జన సదస్సును జయప్రదం చేయాలని సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్ శివప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానికంగా సింహగర్జనకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌నాయక్, ఉత్తంనాయక్, రాజునాయక్, వెంకట్‌నాయక్, ఇందులాల్, శ్యాంలాల్‌నాయక, లాల్‌సింగ్, బలిరాం, దేవి దాస్, తిరుపతి, బలవంత్, కాచ్చు, విష్ణు, దత్తు, లాలు, రాందాస్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

హజ్ పాదయాత్రికుడికి ఘన స్వాగతం


అబిద్‌ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

వాంకిడి, సెప్టెంబరు 1: పాదయాత్రగా హజ్‌కు వెళ్తున్న ఖమ్మం జిల్లాలోని ఇల్లందుకు చెందిన మహమ్మద్ అబ్దుల్‌అబిద్ ఆదివారం వాంకిడికి చేరుకోవడంతో మైనార్టీనాయకులు ఘనస్వాగతంపలికారు. హజ్‌యాత్రకు కాలినడకన బయలుదేరిన ఆయనకు స్థానికమసీద్‌లో శాలువాలతో సత్కరించారు. హజ్ యాత్రకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో చేరుకోవాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మైనార్టీలు నాయకులు హమీద్, షఫీక్, ఉస్మాన్, సైఫ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 1: జిల్లాలో ఆదివారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 44మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు కుమరం భీం, వట్టివాగు ప్రాజెక్టుల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. కుమరంభీం ప్రాజెక్టులోకి 3200 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో మూడు గేట్లు పైకిఎత్తి 3200క్యూసెక్కుల వరదనీటిని కిందికి వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టులోకి 750కూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో ఒకగేటు పైకి ఎత్తి 360క్యూసెక్కుల వనదనీటిని కిందికి వదులుతున్నారు. దీంతో పెద్దవాగు పరివాహకప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతో పాటు ఆయామండలాల్లో కురుస్తున్న వర్షానికి ఇళ్లలో నీరు చేరింది. రెబ్బెన మండలకేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో పలు ఇళ్లలోకి వరదనీరు వచ్చిచేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు.కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంను కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పరిశీలించి పరిస్థితులను సమీక్షించారు.


కుమరం భీం ప్రాజెక్టు గేట్ల నుంచి కిందికి ప్రవహిస్తున్న నీరు


సిర్పూర్(యు)లో కురుస్తున్న వర్షం

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం వర్షం కురిసింది. చిరుజల్లులతో కూడిన వర్షం ఓ మోస్తరుగా పడింది. ఆదివారం సంత కావటంతో వివిధ సరుకులు కొనుగోలు చేసుకునేందుకు మార్కెట్‌కు వచ్చినవారికి ఇబ్బంది కలిగింది. అంతర్గత రోడ్లు బురదమయం అయ్యాయి. వర్షం కురుస్తుండటంతో చిరు వ్యాపారులు దుకాణాలు పెట్టలేదు.

రెబ్బెన: మండల కేంద్రంలో శనివారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. పులికుంటవాగు, నంబాల వాగులు పొంగి పొర్లుతున్నాయి. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీ వర్షంనీరు అధికంగా చేరటంతో ఇండ్లలోకి వర్షం నీరు చేరింది.

సిర్పూర్(యు): మండలంలో ఆదివారం సాయంత్రం అరగంటపాటు భారీవర్షం కురిసింది. ఉరు ములు, మెరుపుల దాటికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీవర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి.

నేడు ప్రజావాణి రద్దు

● విద్యాసంస్థలకు సెలవు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 1: భారీవర్షాల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దుతో పాటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించామని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే ఒకప్రకటనలో తెలిపారు. భారీవర్షాల కారణంగా జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు ఉధ్రుతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు ఎవరూ ఇళ్లనుంచి బయటకు రావద్దన్నారు.

చీలాటిగూడలో ఇల్లు దగ్ధం

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 1: మండలంలోని చీలాటిగూడ గ్రామంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి చౌదరి ప్రకాష్‌కు చెందిన ఇల్లు కాలిపోయింది. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారువచ్చి మంటలను చల్లార్చారు. ఈ ప్రమాదంలో నాలుగున్నర తులాల బంగారం, 30తులాల వెండి, రూ.80వేల నగదుతోపాటు ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు.

పోలీసులకు సహకరించాలి

లింగాపూర్, సెప్టెంబరు 1: గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని లింగాపూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండపాలవద్ద పేకాట ఆడడం, మద్యం సేవించడం, అన్యమతాలను కించపరిచే విధంగా ఉపన్యాసాలు చేయడం నిషేధం అన్నారు.

ట్రస్మా మండల కార్యవర్గం

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 1: ట్రస్మా ఆసిఫాబాద్ మండలకమిటీని ఆదివారం ఆసంఘం జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్‌రావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సందీప్, ఉపాధ్యక్షుడిగా హిదయుతుల్లా, కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా సాబీర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, తిరుపతి, రాజేంద్రప్రసాద్, సంజీవ్‌కుమార్, జితేష్ శితని, సంతోష్‌కుమార్, రాధాకృష్ణ, మల్లిక్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ మృతి

కమాన్‌పూర్, సెప్టెంబరు 1: మండలంలోని జూలపల్లి గ్రామశివారు వ్యవసాయక్షేత్రంలో పొలం పనులకు వెళ్లిన ఓ వ్యవసాయ కూలీ మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన ఇలాసారం కిరణ్(37) పొలం పనుల నిమిత్తం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు. అక్కడ అతనికి సొమ్మ రావడంతో పొలంలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా పోలీసులు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన కిరణ్ 20 సంవత్సరాలుగా జూలపల్లి గ్రామంలో రఘుపతి దగ్గర ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తు న్నాడు. ఇతనికి సొమ్మ రోగం ఉండటంతో మందులు కూడా వాడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కొట్టే ప్రశాంత్ తెలిపారు.

బీఎస్పీ నుంచి కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కాగజ్‌నగర్, సెప్టెంబరు 1: బీఎస్పీని వీడిన పలువురు నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈసందర్భంగా రావిశ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో పెంచికల్‌పేట మండల అధ్యక్షులు బొయర బండు, పొర్తెటి లచ్చన్న, దేవదాస్, గణపతి, బాగిలాల, జనార్దన్ పాల్గొన్నారు.


బీఎస్పీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

'రూ.26వేల వేతనం ఇవ్వాలి'

సిర్పూర్(టి), సెప్టెంబరు 1: మధ్యాహ్నభోజన కార్మికులకు రూ.26వేల వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఉపేందర్ డిమాండ్‌చేశారు. ఆదివారం స్థానికంగా మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఈనెల9,10 తేదీల్లో టోకెన్‌సమ్మె చేపడతామన్నారు. ఈ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కాంతమ్మ, ఉపాధ్యక్షురాలుగా విజయ, లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బుజ్జమ్మ తదితరులను ఎన్నుకున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చింతలమానేపల్లి, సెప్టెంబరు 1:భారీ వర్షాల కారణంగా లోతట్టుప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేష్‌అన్నారు. నదిపరివాహక ప్రాంతాల ప్రజలతోపాటు దిందా, గూడెం, శివపల్లి, కోయపల్లి, ధరంపల్లి, బాబాసాగర్ తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు.

యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా

● పట్టించుకోని అధికారులు


మృతి చెందిన ఆవులు(ఫైల్)

కాగజ్‌నగర్, సెప్టెంబరు 1: జిల్లాలో పశువుల అక్రమరవాణా యథేచ్ఛగా సాగుతోంది. లారీలు, వ్యాన్‌లలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం రెబ్బెన మండలం తక్కలపల్లి బస్టాండు సమీపంలో పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకోగా, అందులో 24 పశువులు ఉండగా, ఊపిరి ఆడక 9 ఆవులు మృతిచెందాయి. మహారాష్ట్ర కేంద్రంగా ఈ దందా నిత్యం జరుగుతోంది. ఆరునెలల క్రితం కూడా కాగజ్‌నగర్ పెద్దవాగు బ్రిడ్జివద్ద కూడా పశువులను తరలిస్తున్న క్రమంలో మూడు ఆవులు మృతిచెందడంతో పెద్దవాగు సమీపంలో పడేసి పోయారు. మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల మీదుగా నేరుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు వెంటనే స్పందించి ఈ అక్రమ రవాణాపై గట్టి నిఘాపెట్టి కేసులు నమోదు చేయాలని జంతు సంరక్షకులు డిమాండు చేస్తున్నారు. ఈ విషయమై డీఎస్పీ కరుణాకర్‌ను సంప్రదించగా పశువుల అక్రమ రవాణా విషయంలో ఎవరినీ ఉపేక్షించమని, కేసులు నమోదు చేస్తామని అన్నారు.


రెబ్బెనలో పట్టుకున్న వ్యాన్(ఫైల్)

అఖినిలో వైద్యశిబిరం

వాంకిడి, సెప్టెంబరు 1: అఖిని గ్రామంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 45మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న ఇద్దరి రక్తనమునాలు సేకరించారు. అలాగే వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, ఏఎన్ఎం గోదావరి, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ

వాంకిడి, సెప్టెంబరు 1: వాంకిడి అంబేద్కర్ యువజన సంఘం కమిటీని ఆదివారం జైతావన్ బుద్ధవిహార్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఉప్రె జైరాం, ప్రధాన కార్యదర్శిగా దుర్గం సునీల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా మహోల్‌కార్ అశోక్, దుర్గం హంసరాజ్, దుర్గం శ్యాంరావు, కోశాధికారిగా ఉప్రె విజయ్, దుర్గం సుధామ్, కార్యదర్శిగా ఉప్రె రోషన్, సమాజపెద్దలుగా కోబ్రగడే విలాస్, మహాత్మే ప్రసాద్‌లతో పాటు కార్యవర్గ సభ్యులుగా రాంటెంకి ప్రతాప్, పీతాంబర్, బలంత్, ఇంద్రజీత్, అరుణ్, దుర్గం సందీప్, ప్రశాంత్, దుర్గం దీపక్, నాగ్‌సేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల
జిల్లా వార్తలు
5
సోమవారం 2 సెప్టెంబరు 2024

కుటుంబాన్ని బలికొన్న ఆన్‌లైన్ ట్రేడింగ్ 7లో..

7లో.. పాత పెన్షన్ సాధించే వరకు పోరాడుతాం

ఎడతెరపిలేని వర్షం

- జిల్లాలో 6.9 సెం.మీ వర్షపాతం నమోదు
- జలకళ సంతరించుకున్న గోదావరి
- ఎల్లంపల్లి గేట్లు ఎత్తడంతో పెరుగుతున్న ప్రవాహం
- లోతట్టు ప్రాంతాలకు పొంచి ఉన్న ముప్పు
- ముందు జాగ్రత్తగా కంట్రోల్ రూంలు ఏర్పాటు
- ఓసీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

మంచిర్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండు రోజు లుగా కురుస్తున్న వర్షం కారణంగా జిల్లాలో జనజీవనానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురుస్తుండటంతో వాగులు, వంకల్లో నీరు చేరగా గోదావరి, ప్రాణహిత నదులు పొంగి పొర్లుతున్నాయి. వర్షం కొనసాగనుండటంతో వాతావరణశాఖ జిల్లాకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. వరుసగా కురు స్తున్న వర్షాల కారణంగా ప్రభుత్వం సోమవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించింది. భారీ వర్షాలకు జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లో వీధుల్లోకి నీరు చేరి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బృందావనం కాలనీలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రాళ్లవాగుకు భారీ వరద తాకిడి కారణంగా ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఓసీపీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

వర్షాల కారణంగా జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు నిలిచి పోగా, ఓబీ మట్టి తొలగింపు పనులకు ఆటంకం ఏర్పడుతోంది. మూడు ఏరియాల్లోని శ్రీరాంపూర్, ఇందారం, రామకృష్ణాపూర్, మందమర్రి, గోలేటి, ఖైరి గూడ ఓసీపీల్లో దాదాపు రూ. 13 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లగా, రూ.4లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత పనులు నిలిచిపోయాయి.

చెన్నూరు: చెన్నూరు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. వర్షంతో జన జీవనం స్తంభించి పోయింది. రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షంతో నాలాలు, రహదారులపై నీరు ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గాంధీచౌక్, కటికవాడ కాలనీల్లోకి ప్రభుత్వ ఆసుపత్రి వెనక నుంచి భారీగా వరద నీరు ఇండ్లలోకి చేరడంతో ఆయా కాలనీల వాసులు ఇక్కట్లకు గురయ్యారు. కటికవాడలోని కస్తూ రి తేజ, అజ్జు, గుం డేటి మధుకర్ ఇండ్లలోకి వరద నీరు చేరడంతో వస్తువు లన్నీ తడిసిపోయాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, గెర్రె ప్రాంతంలోని అయాన్ బార్ వద్ద రహదారిపై వరద నీరు ప్రవహించింది. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఆసుపత్రి వద్ద భారీగా వరద నీరు చేరడంతో ఎక్స్‌కావేటర్‌తో వరద నీటిని మళ్లించారు.

వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ కోరారు. వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు మున్సిపా లిటీలో హెల్ప్‌లైన్‌తోపాటు రెస్క్యూటీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జిల్లాలో 6.9 సెం.మీ వర్షపాతం నమోదు

జిల్లాలోని చెన్నూరు మండలంలో ఆదివారం 6.9 సెం.మీ వర్షపాతం నమోదుకాగా, జైపూర్ మండలంలో 6.0 సెం.మీ, బెల్లంపల్లి మండలంలో 5.2 సెం.మీ, కోటపల్లి మండలంలో 4.1 సెం.మీ, కాసిపేట మండలం కొండాపూర్‌లో 3.8 సెం.మీ, నస్పూర్ మండలంలో 3.7 సెం.మీ, మం దమర్రి మండలంలో 3.6 సెం.మీ, జిల్లా కేంద్రంతోపాటు జన్నారం మండలంలో 2.9 సెం.మీ చొప్పున వర్షం కురిసింది.

కోటపల్లి: కోటపల్లి మండలంలో శనివారం రాత్రి, ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటలపాటు భారీ వర్షం కురవడంతో మండలంలోని పలు గ్రామాల్లోకి వెళ్లే వాగులు పొంగి పొర్లాయి. నక్కలపల్లి దారిలో లోత్వొర్రె, బ్రహ్మ ణపల్లి వద్ద మత్తడివాగు,



నస్పూర్‌లో వరద నీరు పెరగడంతో ప్రవహిస్తున్న గోదావరి నది

ఏదులబంధం వద్ద తమ్మడి వాగు, పారుపెల్లి, లింగన్నపేటల మధ్య ఊరచెరువు వాగు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచి పోయాయి. నక్కలపల్లి దారిలోని లోత్వొర్రె పొంగి పొర్ల డంతో తాత్కాలిక కాజ్‌వేలోని మట్టి కొట్టుకుపోయింది. మరో వైపు వాగు ఉధృతి వల్ల ఇరువైపులా ప్రయాణికులు గంటల కొద్ది నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పాటు వర్షాలతో వాగులు, వంకల్లోని నీరు గోదావరి నదిలోకి చేరడంతో నది ఉధృతి పెరిగింది.

హాజీపూర్: ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను మంచిర్యాల డీసీపీ భాస్కర్ నీటి ఉధృతిని పరిశీలించారు. ప్రాజెక్టుపై నుంచి రాకపోకలను నిలిపివేశారు. గోదావరి దిగువ ప్రాంతాల్లో ఉండే వారు గోదావరి పరిసరాల్లోకి రావద్దని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మధుసూదన్, ఎస్‌ఐ సురేష్‌లు ప్రాజెక్టు వద్ద పరిస్థితిని సమీక్షించారు.



మందమర్రిటౌన్: మందమర్రిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. జాతీయ రహదారితోపాటు రోడ్లన్నీ జలమయంగా మారాయి. రామన్ కాలనీ, రాజన్నల వాడ వద్ద రోడ్లపై నుంచి వరద ప్రవహించింది. పాల వాగు ఉప్పొంగి ప్రవహించింది. రైల్వేస్టేషన్ సమీపంలోని చెరువు నిండు కుండలా మారింది. ఇందుగార్డెన్ సమీపంలోని కాలనీలో రోడ్లపై నీరు నిలిచిపోయింది. మార్కెట్ సెంటర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం ఎదుట నీరు నిలిచింది. సాయిబాబా ఆలయం వద్ద రోడ్డు కోతకు గురైంది.

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంతోపాటు మండలంలో భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. వర్షంతో వాహనదారులు, ప్రజలు బయటకు రాకుండా ఇండ్లకే పరిమితమయ్యారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. మరో మూడు రోజులు వర్షాలు ఉన్నందున అత్యావసరం అయితేనే ప్రజలు బయటకు రావాలని సూచించారు. వర్షాల వల్ల ఏదైనా సమస్య ఉంటే 9059656346, 8074296900, 960382743లకు సమాచారం అందించాలన్నారు.

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలం బోయపల్లి ఎస్సీ కాలనీలో వర్షం నీరు రోడ్డుపైకి వచ్చింది. నడవడానికి వీలు లేకుండా మారింది.

భీమారం: మండలంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు, చెరువుల్లో నీరు చేరిం ది. మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్టు, కొత్త చెరువు పూర్తిస్థాయిలో నిండింది. రైతులు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. భారీ వర్షానికి హైవేపై జన జీవనం స్తంభించిపోయింది. పోలంపల్లి వాగు ఉధృతంగా ప్రవహించడంతో రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపో యాయి.

వేమనపల్లి: చామనపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోం ది. దీంతో చామనపల్లి గ్రామస్థులు మండల కేంద్రం వెళ్లా లంటే కుష్నపల్లి, ముత్తాపూర్ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఈ గ్రామాల ప్రజలకు అదనంగా 30 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది. మండలంలోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీ వరద...

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గుడిపేట సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద తాడికి పెరుగుతోంది. ప్రాజెక్టులోకి పూర్తిస్థాయిలో నీరు చేరడంతో నిండు కుండను తలపిస్తోంది. ఎగువ నుంచి 1,15,074 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 148 మీటర్లకుగాను ప్రస్తుతం 147.15 మీటర్ల ఎత్తుకు నీళ్లు చేరుకున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.813 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరు తుండటంతో సాయంత్రం 6 గంటల వరకు 20 గేట్లను ఒక మీటర్ ఎత్తు వరకు తెరిచి 1,15,074 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. దీంతో గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో గోదావరి జలకళను సంతరించుకుంది. జిల్లా కేంద్రంలోని పుష్కర ఘాట్ సమీపంలోకి వరద నీరు చేరింది. గోదావరిలో నీటి ప్రవాహం పెరుగుతుండటంతో లోతట్టు ప్రాంతాలైన ఎన్టీఆర్‌నగర్, ఎల్ఐసీ కాలనీ, రాంనగర్ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలు కొనసాగుతుండటంతో రాత్రి వరకు మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉండటంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌తోపాటు మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలు అత్యవసర సమయాల్లో 9849044106 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కమిషనర్ మారుతీ ప్రసాద్ తెలిపారు.

జన్నారం: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో అటవీ గుండా ప్రవహించే వాగు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కలమడుగు, ధర్మారం, బాదం పల్లి, తిమ్మాపూర్, చింతగూడ, రోటిగూడ, తపాలపూర్ గోదావర రేవుల వద్ద అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు.

నస్పూర్: వర్షాలతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాల వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం 15వ వార్డులోని ఫంక్షన్ హాల్ వెనుక ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. డ్రైనేజీలో చెత్త చెదారం చేరడంతో వరద నీరు ఇళ్ళలోకి వెళ్ళాయి. మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అడ్డుపడిన చెత్తచెదారం తొలగించారు. కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి నదికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో వరద నీరు చేరి నది ఉధృతంగా ప్రవహి స్తోంది. తీరంకు ప్రజలు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిక లు జారీ చేశారు.

ప్రజలకు సహాయం అందించడానికి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని కమిషనర్ చిట్యాల సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. అపార్టుమెంట్లు, సెల్లార్స్, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ళ యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉంటున్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని సూచించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు కంట్రోల్ రూమ్‌కు సెల్ నంబర్లు 9550665667, 9963287624లకు సమాచారం ఇవ్వాలన్నారు.

మందమర్రిరూరల్: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లు బురదమయంగా మారాయి. రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాలేదు. మండలంలోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు నిండుకుండలా మారాయి.



ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న డీసీపీ



చెన్నూరులో రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు



మంచిర్యాల బృందావనం కాలనీలో రోడ్డుపైకి చేరిన వర్షం నీరు

చెరువులు, భూముల పరిరక్షణకు కమిటీ



ఎన్నికైన కమిటీ సభ్యులు

జన్నారం, సెప్టెంబరు 1: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో ఆదివారం మండలానికి చెందిన వివిధ సామాజిక కార్యకర్తల ఆధ్వర్యంలో మండల చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా శ్రీరాముల భూమాచారి, చైర్మన్‌గా కమ్మల విజయ్‌ధర్మ, వైస్‌చైర్మన్‌గా శనిగారపు మహేష్, ప్రధాన కార్యదర్శిగా కనికారపు ప్రభంజనం, కార్యదర్శిగా వెంబడి సత్యం, ట్రెజరర్‌గా కోడి సృజన్, కార్యదర్శిగా మామిడి విజయ్, సలహాదారులుగా దాసరి తిరుపతి, మహేష్, కార్యవర్గ సభ్యులుగా వెంకటసాయి, ఎజాస్, వెంకటేష్‌లను ఎన్నుకున్నారు. చెరువుల ఆక్రమణలతో ఏర్పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ తరాలకు మేలు జరిగే విధంగా చూడడానికి కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు.

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆశయ్య

శ్రీరాంపూర్, సెప్టెంబరు 1: జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన శ్రీరాంపూర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. గ్రామాలు, తండాల్లో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, వారికి ప్రభుత్వ వైద్యం అందడం లేదన్నారు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తే టెస్టులు, వైద్యం పేరుతో లక్షల రూపాయలు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సుంకె రవి, గోమాస ప్రకాష్, రంజిత్ కుమార్, బోడెంకి చందు, దాగం రాజారాం పాల్గొన్నారు.

అంటువ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తపడాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 1: ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో 24 గంటల పాటు సమాచారాన్ని చేరవేయడానికి సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. వరదలు ఉన్న గ్రామాల్లో ప్రసవానికి సిద్ధంగా ఉన్న వారిని సిబ్బంది ఆసుపత్రికి తీసుకురావాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు అందుబాటులో ఉంటాయని అవసరం అయితే 9177084068లో సంప్రదించాలన్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజా రక్షణ చర్యలపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఎక్కడ కూడా ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని, అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలన్నారు. ప్రజలు జల దిగ్బందంలో చిక్కుకుంటే తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు, కుంటలు, వాగుల వద్దకు వద్దకు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ సిబ్బంది నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎవరు సెలవుల్లో వెళ్లకుండా అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై నుంచి నీరు ప్రవహిస్తున్న మార్గాల్లో రాకపోకలను నిషేధించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతగా పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రజలను అప్రమత్తం చేస్తూ విస్తృత ప్రచారం చేపట్టామని, ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, డీసీపీ భాస్కర్, కలెక్టరేట్ పాలన అధికారి రాజేశ్వర్, పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

నేడు ప్రజావాణి రద్దు

మంచిర్యాల కలెక్టరేట్: భారీ వర్షాల నేపథ్యంలో సోమ వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తు న్నామని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనిం చాలని సూచించారు. ప్రజలు అత్యవసరం అయితేనే బయటకు రావాలని, ప్రజల అవసరాలకు కంట్రోల్ రూమ్ 08736-250501 ఏర్పాటు చేశామని, ప్రజలు సంప్రదించవచ్చని తెలిపారు.

వసతి గృహాలను తనిఖీ చేసిన డీడీ

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 1 : పట్టణంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పోటు రవీందర్‌రెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులకు జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలుంటే వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లాలని, తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. వంటగదులను పరిశీలించి విద్యార్థుల భోజనం గురించి వాకబు చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్ సునీత, రాజులకు సూచించారు. అనంతరం రిజిష్టర్‌లను పరిశీలించారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌కు టీపీసీసీ పదవి ఇవ్వాలి

జన్నారం, సెప్టెంబరు 1: కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవిని ఇవ్వాలని తెలంగాణ మాదిగ జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్ చిలుక సంతోష్, జిల్లా ప్రెసిడెంట్ కత్తెరపాక రాజేష్‌లు కోరారు. ఆదివారం జన్నారంలో వారు మాట్లాడుతూ దశాబ్దంగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ పార్టీ అభ్యున్నతికి మహేష్‌కుమార్‌గౌడ్ కృషి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆయన చేసిన సేవలను గుర్తించి టీపీసీసీ పదవి ఇవ్వాలని కోరారు.

నెలాఖరులోగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 1: మంచిర్యాల నియోజకవర్గంలో నెలాఖరులోగా అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు జరుగుతాయని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఐబీ చౌరస్తాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం శంకుస్థాపనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ జాతీయ నేతలు హాజరవుతారన్నారు. రాళ్లవాగు వరద ముంపు వాటిల్లకుండా కరకట్టను నిర్మిస్తామని, అలాగే ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. ముల్కల్ల నుంచి బసంత్‌నగర్ గోదావరి నదిపై రూ.373 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని, నియోజకవర్గ కేంద్రంలో రెండో బ్రిడ్జి నిర్మాణం కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లాయన్నారు. ప్రతీ ఒక రైతుకు రుణమాఫీ, రైతుభరోసా అందిస్తామన్నారు. రూ.2లక్షల రుణమాఫీ విషయంలో ఎలాంటి అపోహలు వద్దని, సాంకేతిక కారణాల వల్లనే కొంత జాప్యం జరుగుతుందని, అంతే తప్ప ఏ రైతుకు నష్టం జరగదని చెప్పారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. బీఆర్ఎస్ నేతలు భూఆక్రమణదారులకు మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మున్సిపల్‌చైర్మన్ ఉప్పలయ్య, పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చి అభివృద్ధి చేస్తా

లక్షెట్టిపేటరూరల్: ఇచ్చిన హామీలను నెరవేర్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. గురునానక్ ఫంక్షన్‌హాలులో 194 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. పదేండ్ల పాలనలో అప్పటి పాలకులు చేసిన నిర్లక్ష్యం, అక్రమాలను రానున్న రోజుల్లో ఎండగడతామన్నారు. రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, ఆర్డీవో రాములు, తహసీల్దార్ దిలీప్‌కుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, పట్టణాధ్యక్షుడు ఆరీఫ్, మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, ఫ్లోర్ లీడర్ నాగభూషణం, రమేష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 1: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వంగ చక్రపాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ సబ్జెక్టు 2 పోస్టులు, తెలుగు-1, కామర్స్-2, ఫిజిక్స్-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీలో సంబంధిత సబ్జెక్టులో ఎస్సీ, ఎస్టీ వారైతే 50శాతం, ఇతరులు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఎన్ఈటీ, ఎస్ఈటీ, ఎస్ ఎల్ఈటీ, పీహెచ్‌డీ ఉండి, డిగ్రీ కళాశాలలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నెల 3వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలని, 4వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ జరుగు తుందని, అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంట ర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల్లో గెస్ట్ లెక్చరర్లుగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవా లని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ 1, కామర్స్ టాక్సేషన్ 1, బాటనీ 1, జువాలజీ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయ న్నారు. పీహెచ్‌డీ లేకపోతే నెట్ అర్హత గల వారికి అవ కాశం ఉంటుందని తెలిపారు. ఈ నెల 4వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

పొలాల అమావాస్యను ఘనంగా జరుపుకోవాలి

జన్నారం, సెప్టెంబరు 1: పొలాల అమావాస్య పండుగను సోమవారం నేతకాని కులస్తులు ఘనంగా జరు పుకోవాలని నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, బోర్లకుంట ప్రభుదాస్, జాడి గంగా ధర్‌లు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పొలాల అమావాస్య విశిష్టత, సంస్కృతి, సంప్రదాయాలను అనుసరిస్తూ పండగను నిర్వహించు కోవాలని సూచించారు. లక్ష్మణ్, వెంకట్, మల్లయ్య, శ్రీనివాస్, వినోద్, స్వామి, సాగర్, దత్తు, అమృతరావు, నందయ్య, లచ్చన్న శంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

హాజీపూర్, సెప్టెంబరు 1 : రాంపూర్‌లోని సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఆదివారం కొనసాగాయి. కబడ్డీ, 100 మీటర్ల రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్ పోటీలను నిర్వహించారు. వర్షం వల్ల కొంత అంతరాయం కలగడంతో త్వరగా ముగించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు రామన్న తదితరులు పాల్గొన్నారు.